చిన్న రూపకము :

# ఒక బీదవాని కల నేటికి ఫలించింది

శ్రీ కవికొండల వేంకటరావు.

ఇందు వచ్చు పాత్రలు :

| | |
|---|---|
| నాగార్జునుడు | బీదవాడు |
| 1 వ. శిష్యుడు | బీదరాలు |
| 2 వ. శిష్యుడు | ఊప్పరులు |

:o:

ఇద్దరు శిష్యుల సంభాషణ

1. శిష్యుడు : మనము ఎన్ని బొమ్మలు ఈ కొండను బట్టి చెక్కితే అన్ని బొమికలకోటీ అస్థిపంజరాలు రోజురోజూ బయల్పడుతున్నాయి !

2. శిష్యుడు : ఎత్తిపారవోయడమే మనపని. బొమికలు కనపడ్డకొద్దీ, వాటిని పారపోసి వాటి ప్రత్యామ్నా బొమ్మలను నిలుపడమే ! ఏమి నడుము ఎత్తినావు ? అలసట వచ్చిందా?

1. శి: అలసటాలేదు. అదుపూలేదు. ఆవులింత వచ్చింది ఒక్క నిమిషము నిద్రపోయి మళ్ళీ పనిలో పడతా !

2. శి: అరుగో ! మన గురువులగు నాగార్జునులిటు వచ్చుచున్నారు ! ఆవులించకలే !

(నాగార్జునుడు ప్రవేశించును)

నాగార్జునుడు : భూతల మెల్లను రెండింటితోనే ఏర్పడిందిఅనుకొంటాను. ఒకటి కళ ; రెండవది కనికరమూను !

1. శి: ఆలానే తోస్తున్నది ఈ ఎముకల గూళ్ళను చూస్తున్నకొద్దీ !

నాగా : ఈదురవస్థను చూచేకదా బుద్ధభగవానుడు కనికరమూని విరాగియయినాడు !

2. శి: బుద్ధభగవానుడు ! అతని వంటి శాంతి రూపుడు మఱి పుట్టబోడు, పెరగబోడు.—నేను చెక్కిన యీ ప్రతిమ యెలావున్నది?

నాగా : కళఉట్టి పడుతూఉన్నది : బహుచక్కగానున్నది ! కాని సంఘమందు ఆ సౌందర్యము, ఆ సమర్థత ఉన్నదా?

1. శి: ఉండకేమిస్వామి ! అలవరచుకుంటే !

నాగా : అది అస్థిపంజరమా? కదలుచున్నట్లున్నది ! మనిషేమో?

2. శి: [దగ్గరకు వెళ్ళిచూచి] మనిషే ! మాటలాడుచున్నాడు !

నాగా : మనతోనా? వానిలోవాడా?

1. శి: మనవైపుచూచుచు తనలో తా ననుకొనుచున్నాడు గురుదేవా !

నాగార్జునుడు :<br>శిష్యులు : } [వినుట నభినయింతురు]

బీదవాడు : స్వామీ ! నాగార్జునా ! తండ్రీ ! ఇంట్లో పేదరాలు భిక్ష చేస్తానంటూ వున్నది దయచేయండి !

నాగా : ఇక్కడొక యిల్లున్నదా? ఏదీ కనపడదే?

1. శి: ఎక్కడ ఒక స్త్రీవుంటే అదేయిల్లు అని వాని అభిప్రాయమై యుంటుంది. అదిగో ! వాని ప్రక్కన పడియున్నది యొక యస్థిపంజరము బోలు శరీరముతో—కృశించి—కృశించి— బెత్తెడు గుడ్డతో తన మానము కప్పుకొంటూ !

2. శి: వాళ్ళానేడు మహాస్వాములకు భిక్షచేయబోవునది?

1. శి: అవును అంగీకరించినట్లున్నారు! నీవేమంటావు?

2. శి: నేను అంగీకరించ వద్దంటాను అట్టివాళ్ళిడు భిక్షను సర్వసస్యసమృద్ధమై, పుష్టికరమై ప్రజవున్నప్పుడే మనయొక్క భోజనముగాని లేనప్పుడు మనం ఉప వాస ముండవలసినదే!

నాగా: వాడుఇడు భిక్షఎట్టిదో ఏమో గ్రహించకుండా నీ వనుచున్నావు!

1. శి: ఈ లోకములో నొకడు మఱియొకని పేదతనమును బాపనసమర్థుడా? మనస్వాము లేమి చేయువారో చూతము! ఆ బడుగు దంపతులు ఎట్టి భక్తిని మన స్వాముల యెడచూపువారో చూతం!

2. శి: ఫలం! పుష్పం! పత్రం! తోయం! ఈ నాల్గింట నేదేనియగునన్న, వారు పండుకున్న చెట్టుమూలము ఎండియున్నది. పండులేదు! పుష్పములేదు, ఆకులేదు మఱి తోయమా! ఈ చుట్టుపట్ల లభింపబోదు. ఏరు లేదు, చెరువులేదు, నుయ్యిలేదు, చెలమ యూరు పరిస్థితి ఏమీ కానబడదు.

నాగా: [ఆలోచనలో మునుగు వారు తేరుకొనుచు] వారు కన్నీరు నా కర్పింతురను కుంటాను. పదండి! శిష్యలూ పదండి! ముందుకు!

1. 2. శి: మనము వారి ముందేయున్నాము. వారి ముందుకు మన మేగ నక్కరలేదు.

నాగా: ఓ దంపతులూ! ఇదా మీ యిల్లు!

బీదవాడు: ఇదేస్వామి! ఈ ఆరుబయలేస్వామీ! ఈ యుత్తిసానువే! ఈ స్త్రీ నాతో ఉండ బట్టి ఇల్లగుచున్నది. మా యిల్లు అగుచున్నది. ఏమంటారు? తమరు?

నాగా: ఏమిచేయమంటావు నన్ను?

బీద: ఏమి అంటాను? తమపాదములు అలా చాపమంటూ వున్నాను.

నాగా: కన్నీళ్ళతోనా కడుగుట?

బీదరాలు: అవును స్వామీ! కదలలేని అస్థిపంజరమును

నాగా: అస్థిపంజరము వైనా నన్ను భిక్షకు పిలిచినావు!

బీరా: అవును! ఒక్క చిరునవ్వు. మీరు చూస్తుంటే నేను నవ్వి చనిపోవాలి!

[అని నవ్వుతూ చనిపోవును]

(తెరపడును)

## రెండవ రంగము

"కృష్ణవేణి" యొక్క పాతాళ గంగ ధ్వనులు

"శ్రీశైలంమీద తపస్సు చేసుకుంటూ నాగార్జునుడు

నాగా: నన్ను నాశిష్యులుకూడా విడనాడినారు. నేజెప్పిన వివేకపుబలుకులు వారికి నచ్చలేనట్టుంది. వారచ్చటనే అలా ఎముకల నెత్తిపోస్తూ — బొమ్మలు చెక్కుతూ వున్నారులాగుంది. అసలుఅంశము వదిలేసి (పాతాళ గంగధ్వని వినవచ్చినట్లభినయించి) ఈ నే కూర్చున్న చోటనే ఈ వింతధ్వనియేమి? (అనితొంగిచూచును) ఇది "కృష్ణవేణమ్మ"దా? ఆహా! కృష్ణవేణీ! నమస్కారములు! నీ వీ కొండల్లో నృత్యము చేస్తూ ప్రవహిస్తూ వున్న స్థలంలోకి వచ్చి ఏనాడైనా బుద్ధ భగవానుడు చూచినాడా? చూచివుంటే అ కొండమీద అటువంటి బొమికలు వుండి వుండవు. ఎన్నని ఎత్తిపోయగలరు నా శిష్యులు? నీవు కాస్త అలాప్రవహించరాదు. ఆ బొమికలన్నీ కొట్టుకు పోయ్యేలా!-ఏమి? తిరుగ బీదవాడు!

బీద: ఈమాటు నేనే మీకు భిక్షమిస్తూ వున్నాను. శ్రీశైలపర్వతానికంటా వచ్చి స్వామీ! నా ఆతిథ్య మంగీకరింపరూ?

నాగా: నేనెంతదూరము వెడితే అంతదూరం సాగివచ్చి వున్నాడు! ఈ మనిషిని జూస్తే ఎముకల గూడులాగున్నాడు! ఆ! ఎముకలగూడే! మళ్ళీ మాటలాడుతున్నాడు!

బీద: నేనేనండీ! నా ఆతిథ్యమంగీకరింపరూ?

నాగా: (ఆర్తిపరుడై) కరుణ! కరుణ! బుద్ధభగవాన్! నీ కరుణ!

(కృష్ణవేణి ఇంకా బిగ్గరగా నినదించును)

ఓహో! బీదవాడా! నీఎముకలగూటిమీదుగ ప్రవహించే

కృష్టవేణమ్మయొక్క పాతాళగంగ ! ఎగురుచున్నాను నీవున్నూ ఎగురగలవా? (ఎగురును)

బీద : మీ దయవున్న ఆఁ (అని ఎగురును)

నాగా : ఆహా ! భూమి మీద క్రింద ఎంత అందముగా ప్రవహించు చున్నది కృష్ణవేణమ్మ !

బీద : సన్నని గీతలానాకు కనిపిస్తూవున్నది !

నాగా : దాని ప్రక్కన ఒక మహాపట్నము నిర్మింపబడు తూంది !

బీద : అవును ! అవును ! నేను చూస్తూవున్నాను — అదే నాకు కలలో గోచరించింది ఇప్పుడు వెలిసింది. ఈ బీదవానికలలో ఏనాడో వెలిసింది ఈనాటికి నిజమైంది. మనమూ పట్నంలోకి దిగుదాము స్వామి !

నాగా : దిగవచ్చునుగాని అది మాత్రము శాశ్వతమా? ఇలా ఎగురుతూ ఎగురుతూ ఎక్కడికోపోతూ దాన్ని ఇంకా చిన్న రూపంలో చూడ్డమే మేలు !

బీద : అయితే శాశ్వతమైన పదార్థ మొకటుందా !

నాగా : లేదుమరీ ! బుద్ధభగవానుని కరుణ ! కరుణ ! సంఘం శరణం గచ్ఛామి ! బుద్ధం శరణం గచ్ఛామి అహా ! బీదవాడు మళ్ళీ క్రిందకు దిగిపోవుచున్నాడు! అకటా ! ఆ ఎందుకు పడతాడో? వాడికేం దెబ్బ తగులుతుందో !—

బీద : నాకేం దెబ్బలు తగులలేదు స్వామీ మీదయవల్ల ! నేను విజయము కాంచినాను నాకల నిజమయినది. ఇదే విజయపురి : ఇదే ఇక్ష్వాకుల నగరము ? అష్ట ఐశ్వర్యములతోటి తులతూగేనగరము ; దిగుచున్నాను (దిగిపోవును)

నాగా : తల్లీ ! కృష్ణవేణమ్మ ! ఈనగరము మాత్రము శాశ్వతమా ? ఈ బీదవాని పేదతనము బాపువారా ఆరోజులలో రాణీలు? అహా! రాజ్ఞులుఇక్ష్వాకులకులాంగనలు ! ఎలా కట్టించి వేయుచున్నారు బౌద్ధ చైత్యాలు! వారందరును మహాయాన భౌద్ధమతమును స్వీకరించి పునీతులగుచున్నారు. నేనున్నూ దిగుతా ? దిగుతా ! (అని దిగును)

(తెరపడును)

## మూడవ రంగము

(విజయపురి సందడి)

బీద ! ఈ నగరంలో నేనే తెలుసుకోలేకుండా వున్నాను. ఇతరులు తెలుసుకొనేదెట్లా? నా వైపు నేను చూచు కోవడమే సరిపోతూవుంది. ఇతరం చూడడమెట్లా? ఆహా ! ఎటు చూచినా సౌభాగ్యమే ! సంపదే ! సిరే! ఇది ఏనాటి శిలో ఇంతకాలానికి మేరూపర్వతమైంది: లేకుంటే నేను ఇన్నాళ్ళు మెట్టిన ఈ అడవులవెంట ఈ చరియలవెంట ఈ బంగారమేమి? ఈ వజ్రాలేమి? ఎవరిని చూచినా పట్టుబట్టలమీద నడుస్తున్నవారుగానే తోచేరు ! ఇందు ముష్టివేయండి అని అడగడానికి సిగ్గుగానున్నది. ఒకడూ చనిపోడు ! ఎవడు శవాకారంగా నడువడు ! ప్రతివాని కళ్ళు చైతన్యజ్యోతులే : జీవన ప్రభాతాలే ! ప్రతీస్త్రీ ఒక సౌభాగ్యవతి అయియున్నది. ప్రతీ కుర్రవాడూ అతి చలాకీగా ఆడుకొంటూవున్నాడు ! భూమిఅంతా సస్యశ్యామలం ! చల్లని జలమయం ! ఓహో ఇందు శాశ్వతముగా నుండిపోనిచ్చునా నన్ను భగవంతుడు ? ఆ నాగార్జునుడు ?

నాగా : (దిగుతూ) ఉండనిచ్చేనా శాశ్వతముగా గౌతమ బుద్ధుని మహాహర్మ్యంలో? భార్య కౌగలింతలో? కూర్మి కొడుకు చిరునవ్వు పిలుపులు వింటే? అతడీ సమస్తము రోసి వెడలి పోలేదుటోయి ఆబుద్ధుడు? అంతకంటె గొప్పనిడుచున్నవా యీ పురమున సిరి సంపదలు?

బీద : నీ వెవ్వరవు స్వామీ ! ఇంతచేటు అన్నీ అశాశ్వతము లను వాడవు?

నాగా : "నన్ను నీ వెవరవు?" అనువరకు వచ్చిందా నీ వ్యాపారము? నేను నాగార్జునుడను. బుద్ధభగవానుని అడుగుజాడలలో ప్రవర్తించువాడను. నీవు రాణీలు కట్టించు మహాయాన చైత్యాలు అందలి బొమ్మలు చూడక ఈ మేడలు మిద్దెలు తిలకిస్తున్నావేమి?

బీద : అవి శాశ్వతములా స్వామీ !

నాగా : కాకుంటే అలాబోధించాడా బుద్ధభగవానుడు ! అరుగో నా శిష్యులిలా వచ్చుచున్నారు. వారు నాతో ఏమి చెప్పుతారో?

బీద : నేనును విందుగాక !

1. శి : మఱి బీదతనము ఈ లోకమునుండి పారదోల బడినది ! నీతోనే చెప్పునది బీదవాడా ! నీ భార్య ఎందున్నది? ఆమెతో నీవార్త చెప్పి నీ కూడా తీసి తెచ్చుకో.

2. శి: వానిభార్య అనాడే చనిపోయింది.

బీద : మఱిరాదు ! మఱిరాదు ! (అని కళ్ళనీళ్ళు కార్చును)

నాగా : కళ్ళనీళ్ళుకార్చు నీబెంగచూచే, ఈ భాగ్యమంతా అశాశ్వత మనుచున్నాను.

బీద : అశాశ్వతము కానిదేది? ప్రభూ !

నాగా : ఇందలికళ! ఈకొండనంటియున్న కళావిజ్ఞానము!

బీద : అది నాకన్నులకు కానరాకున్నది ప్రభూ !

నాగా : నీవు బీదవాడవు కాని భిక్షుకుడవు కావలె.

1. శి: అనగా తెలియదూ ? చూవలె? మూవలె ! ఈ మహామహా మందిరము సుమణిమయ దీప్తిగా వెలయింవవలె !

2. శి: బుద్ధభగవానుని చరిత్రచెక్క !

1. శి: వాడప్పుడే తన్మయత్వమున మునిగిపోవువాడు !

నాగా : ఆలాగా? ఆలాగా? వానినొకచైత్యమున జేర్చుడు బుద్ధం శరణం గచ్ఛామి ! ధర్మం శరణం గచ్ఛామి ! సంఘం శరణం గచ్ఛామి!

(తెరపడును)

## నాలుగవ రంగము

(నాగార్జున సాగరం హోరు దూరమున)

బీద : ఉండుండి ఇప్పుడు మెలకువ వచ్చినది. ఏవీ ఆ బంగారం, వెండి, వజ్రం, వాటితోకూడిన గనులు?— విజయపురమేది? ఇందాసందదేది? ఏరీ నాస్వాములు నాగార్జునులు? వారి శిష్యులుఏరీ ! అహా ! ఎంతలో ఎంతమార్పు వచ్చివేసినది ! — ఎన్ని మార్పులు వచ్చినా నా బీదతనము బీదతనములాగే యున్నది, (అని పరిభ్రమించును) ఇక్కడెవ్వరో ఏమో త్రవ్వ చున్నారు. మీ రెవ్వరు?

త్రవ్వువారు : మేమా ! ఉప్పరులము. ఈ యిక్కడ త్రవ్వకొలదిని శాసనములు శిల్పములు ఏనాటివో బయలు పడుచున్నవి. నీవు అనాటి వాడవా?

బీద : ఏనాటిని గురించి మీ రడుగుచున్నారు !

త్రవ్వు : ఈ శిల్పములు అవీ చెక్కిననాటి వాడవా?

బీద : ఆలా కనబడుతూ వున్నానా?

త్రవ్వు : ఏమో మిక్కిలి పురాతనపు వానిలాగ కనబడు చున్నావులే !

బీద : బీదతనమునకు పురాతనమేమి? అధునాతనమేమి? అవునుగాని ఇందు స్వాములు నాగార్జును లుండ వలె ! ఆయన శిష్యు లుండవలె !

త్రవ్వు : ఉండవలెనట! కాని కానరారు ! వారుగావించిన కళ కనబడుతుంది త్రవ్వకొద్దీ !

బీద : ఇలా త్రవ్విన కొద్దీ చైత్యము వెంట చైత్యము విలాసము గొల్పశమేగాని, విభవము కానరాదు !— ఆ విజయపురి కానరాదు ! ఆ పౌరులు కానరారు !— ఒక్క నేను నా బీదతనమూ మాత్రము కనబడు వారము.

త్రవ్వు : ఎలా కనబడ గలదింకా నా బీదతనము? దానిని బాపే మార్గములేదా?

బీద : లేకేమి లేకేమి? ఇదంతా మహాసాగరము చేసి యిందు నుండి కాల్వలు త్రవ్వడు.

త్రవ్వు : అదా నా సంకల్పము. వల్లె ! వల్లె ! వల్లె ! (అని త్రవ్వుతారు)

బీద : (కూడా త్రవ్వును)

(పాట)

నాగార్జున మహాసాగర్ !
నాగార్జున మహాశిల్పమ్ !
ఇది నాగార్జునకొండ !
మా బీదతనము బాపే
నాగార్జున స్వామీ !
విజయంచేయి విజయంచేయి
నీ సంకల్పము, నీ సంకల్పము
కొనసకంటా నెరవేరి
విజయంచేయి ! విజయుంచేయి.

నాగార్జునుని వాక్కు :

సంఘం శరణం గచ్ఛామి !
ధర్మం శరణం గచ్ఛామి !
బుద్ధం శరణం గచ్ఛామి !